# సంఘం

రచన :
"మూర్తిశ్రీ".

'ఛీ ఇంకా ఏ ముఖంపెట్టుకొని ఇంటి గడపతొక్కుతున్నావ్ పరీక్ష పోగొట్టుకున్న మొద్దువెధవ్వి అక్కడే సముద్రంలో పడి చావక మళ్లా ఎందుకొచ్చావిక్కడికి! సిగ్గూలేదూ!

స్కూల్ ఫైనల్ పరీక్ష పోయినందుకు పాలిపోయిన ముఖంతో ఇంట్లో ఏం జరుగుతుందనే భయంతో మెల్లెక్కుతున్న మూర్తికి ఈ మాటలు హృదయానికి శూలాల్లాగ గుచ్చుకున్నాయ్. పరీక్షపోయినందుకే అతను ఎంతో బాధపడుతూవుంటే శూలాల్లాంటి సవతితల్లి మాటలు పూర్తిగా వికలమై పోయివున్న మూర్తి హృదయంలో తుఫాను రేపారు. తడబడుతున్న గొంతుకతో మెల్లగా ఏదో చెప్పబోయాడు మూర్తి.

'చాల్లే! నువ్వు మరేం సంజాయిషీలు నాదగ్గర చెప్పకోనవసరంలేదు. అవునుమరి. పరీక్షలు ముందు సినిమాలు జల్సాలు లావయిపోతే ఎలావస్తుంది చదువు! ఇప్పుడు నీ పరీక్ష పోయినందువల్ల ఈ మూడొందల రూపాయలు గంగలో కలిసినట్టేనా! మేమూ సంసార్లమేగాని ఏమంత సామంతులంకాం ఇక నిన్ను భరించలేం బాబూ అని ఆమె తన యిష్టం వచ్చినట్టూ అనుకొనిపోతూవుంటే మూర్తి హృదయానికి ఆమాటలు సమ్మెట పోట్లలాగా తగిలాయ్ వెళ్ళి ఒక నిర్జీవ ప్రతిమలాగా గదిలో కూలబడ్డాడు. మూర్తి అనుకున్నంత పనిజరిగింది. తన పరీక్షపోయినందుకు కంటే తన సవతితల్లి అన్న యీ కఠోరమైన మాటలకు ఎక్కువ మీదపడ్డాడు. మూర్తి యిక యిటువంటి నరక కూపంలాంటి ఇంట్లో ఇకతాను ఉండటమనేది అసంభవమని గ్రహించాడు మూర్తి.

'ఇక అతను ఎలా బ్రతకడం? జీవితం ఎలా గడుస్తుంది స్కూలుఫైనలు పరీక్ష పోగొట్టుకున్నాడు తల్లిదండ్రులకు దూరమయ్యాడు అన్నిటికంటె ముఖ్యంగా తన్ను అమితంగా ప్రేమించిన సవతితల్లికి విరోధి అయ్యాడు ఇక అతనిగతేమిటి మూర్తికి తనభవిష్యత్తంతా గాడాంధకారంగా కనుపించింది.

మూర్తి హృదయం ఇంత బాధపడటానికి ఇప్పుడు జరిగిన యీ రెండు సంఘటనలే కారణంకాదు షుమారు నాలుగు సంవత్సరాలనుంచీ అంతవరకూ ఈ సవతితల్లి దగ్గరే ముద్దుగా పెరుగుతూ వచ్చినమూర్తి ఈ నాడు యీమెవల్లనే నరకయాతన అనుభవిస్తున్నాడు. తనని ఎంతో అభిమానంగా ఆదరణగా చూసిన యీ సవతితల్లే. ఈ నాడు తన పాలిట యమదూతగా మారింది. ఈ మార్పు ఆమెలో కలిగినందుకు మూర్తి తన సవతితల్లిని దూషించలేదు. ఆమెలో యీ మార్పు కల్గించిన విష సంఘాన్ని దూషించాడు. మూర్తి అదృష్టవంతమైన తన జీవితాన్ని చూడలేక స్వార్ధపరులైన తన సవతి తల్లికి దుర్బోధలు గావించిన యీ లోకాని దూషించసాగాడు మూర్తి. 'ఛీ యీ సంఘం నామీద కత్తికట్టింది. అదృష్టమైన నా జీవితాన్ని చూడలేక నా తల్లిహృదయంలో విషబీజం నాటి నా జీవితాన్ని నాశనంచేసింది. ఈ సంఘానికి నేనుచేసిన అపకారమేమిటో? అని అనుకున్నాడు మూర్తి. కాని సంఘంయొక్క సహజగుణమే అటువంటిదన్నసంగతి ఆ హృదయానికేం తెల్సు పాపం.

మూర్తి సవతితల్లి కాపురానికొచ్చిన రోజుల్లో తల్లిని పోగోట్టుకొన్న మూర్తిని తన సవతికొడుకులాగా చూడకుండా' స్వంత కొడుకులాగానే భావించి చాల అభిమానంతో చూస్తూఉండేది. ఆఖరుకు ఆమెకూడా సంతానంకలిగినా తన మనసు మార్చుకోక ఈ లోకంవల్ల తనకు ఎక్కడ మాటవస్తుందేమోనని మూర్తిని జాగ్రత్తగా చదివిస్తూవస్తూ ఉండేది.

ఒకసారి మూర్తి సెకండుఫారం పరీక్ష ఫెలయిపోయిననాడు పడుకొని ఏడుస్తూవుంటే ఆమె ఎంతో వాత్సల్యంగా మూర్తి తల నిమురుతూ పోనీలే నాయనా! వెధవ సెకండుఫారంపరీక్షే కదా. వచ్చే సంవత్సరం ఫస్టుక్లాసులో ప్యాసవుదువుగానీలే ఈ మాత్రం దానికి నువ్వు మనసు పాడుచేసుకోవట మెందుకూ అని ఓదారుస్తూ తానే స్వయంగా అన్నంకలిపి తినిపించినటువంటి తార్కాణాలెన్నో వున్నాయ్. ఆమె ఎంతో అభిమానంగా చూసేదనటానికి. కాని ఎంతఅభిమానంగా చూస్తున్నా ఏం లాభం? ఒకరు బాగుపడుతూవుంటే చూసి ఓర్వలేని సంఘం ఒకటివున్నప్పుడు మూర్తివంటి

జీవితాలు ఎలా సుఖంగా గడుస్తాయి? తమ స్వార్థాల కోసం ఇంకొకరి జీవితాలు నాశనం చెయ్యడానికికూడా వెనుకాడని యీ లోకంయొక్క చెప్పుడు మాటలవల్ల ఏ మూర్తివంటివారు ఎంతమంది నాశనమైపోరూ? తప్పకుండా నాశనమైపోతారు. ఈ స్వార్థపిశాచియైన సంఘంయొక్క రథ చక్రపు ఇరుసుల్లోపడిన మూర్తివంటివారి దిక్కులేని జీవితాలు ఎన్నో నలిగిపోతాయ్. యీ లోకులయొక్క చెప్పుడు మాటలవల్ల మూర్తివంటివారు ఎంత మందో అన్యాయంగా నశించిపోతారు.

మూర్తి తన సవతితల్లికి ఎక్కువ ఆదరణపాత్రుడు కావటం ఆమె మూర్తిని ఎంతో అభిమానంగా చూడటం ఆమె తల్లిదండ్రులకు కంటకం కలిగించింది. తమ కూతురు తన స్వంత మనుమనికంటె, తమకు పరాయివాడయిన మూర్తిని అన్ని విధాల ఎక్కువగా చూడటం వాళ్ళకు అసూయకల్గించింది. యిది ఇంకా సాగనిస్తే ముందు ముందు చదువు విషయంలో నయితేనేమి తమ స్వంతమనుమడికీ అన్యాయం జరుగగలదని భావించారు. దీనిని ఇంతటితో అరికట్టి మూర్తిమీద ఆమె మనసు విరిచి వేయాలనే నిశ్చయాన్ని కొచ్చారు. ఆతల్లిదండ్రులు దానికితగ్గ ఆయుధం ఒక్కటే అదే చెడుబోధలు గావించడం! మూర్తిమీద ఆమెకుగల అభిమానాన్ని అంతం చేయాలంటే మాటలు చెప్పి ఆమె మనసు విరిచివేయాలి అప్పుడే వాళ్ళ ఆశయం నెరవేరుతుంది. చెప్పుడుమాటల వల్ల ఎంతటి కార్యాన్నయినా, యిటువంటివారు చెయ్యగలుగుతారు. ఒక్కసారివెళ్ళి ఆమె హృదయంలో చిన్న విషబీజం నాటివేస్తే చాలు. క్రమంగా అదే పెరిగి మహావృక్షంగామారి అది మూర్తిమీద పెళపెళమని విరుచుకుపడుతుంది. అంతే ఆ ఒక్కపనిచేస్తే చాలు. తమ ఆశయం నెరవేరి పోతుంది. మిగతా వాళ్ళు ఎలా పోతే తమకేం తమ మనుమడి భవిష్యత్తు సుఖంగా వుంటేచాలు.

తల్లిదండ్రులిద్దరూ బయల్దేరారు. తమ ఆశయం నెరవేర్చుకోడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. చెప్పుడు మాటలకి స్త్రీ హృదయం లొంగడం ఎంతసేపు వీరు చెప్పుడు మాటలు ఆమె హృదయంలో బాగా నాటుకుపోయాయ్. అంతే ఆమెది స్త్రీ హృదయం కావటం వల్ల మూర్తిపట్ల శక్తిస్వరూపిణిగా మారింది. కాలచక్ర ప్రవాహంలో మూర్తిమీద ఆమెకున్న అభిమానం కొట్టుకుపోయింది. ఆ రోజుల్లో మూర్తి జీవితపునాదులు కదలిపోయాయ్. తమ ఆశయం నెరవేరినందుకు లోకం మూర్తినిచూసి వెకిలిగానవ్వింది. ఈ సంఘటనకు కారణం అప్పుడు అర్థంచేసుకోలేకపోయినా ఈనాడు అర్థంచేసుకున్నాడు మూర్తి.

ఈ సంగతులన్నీ జ్ఞాపకానికి రాగానే మూర్తిహృదయం బరువెక్కిపోయింది. అతనిలో దుఃఖం ఆగిందికాదు మంచం మీద పడుకొని బావురుమని ఏడ్చాడు మూర్తి.

ఇక యీ ఇంట్లో నాకు స్థానంలేదనుకున్నాడు మూర్తి. దురదృష్టవంతుడైన తనని ఎవరు పోషిస్తారు లోకం తన సవతితల్లిచేత తనకి యీ ఇంట్లో స్థానం లేకుండా చేసింది. స్వతంత్రంగా బ్రతకడానికి అర్హత ఎక్కడిది? మూర్తికి ఏమిచెయ్యటానికి పాలుపోవడంలేదు. ఇంకా ఈ నరకకూప లోనే వుంటున్నావా పో ఎక్కడికైనా సరే వేగంగా పో అని బోధిస్తోంది మూర్తి మనస్సు.

'ఎక్కడికి వెళ్లను వెళ్ళి ఏ ఆధారం లేకుండా ఎలా బ్రతకను' అని ఆవేదనపడుతున్నాడు మూర్తి.

ఈ సమస్యలలోపడి కొట్టుకునే మార్గం తెలియక బాధపడుతూన్న సమయంలో,

'ఛీ ఇంకా ఏముఖంపెట్టుకొని ఇంటి గడప తొక్కుతున్నావ్ పరీక్ష పోగొట్టుకున్న మొద్దువెధవ్వి అక్కడే ఏ సముద్రంలోనో పడి చావక మళ్లా ఎందుకొచ్చావ్ నిక్కడికి సిగ్గులేదూ' అన్న సవతితల్లిమాటలు మూర్తి చెవుల్లో ఒక్కసారి గింగురుమని మారుమ్రోగాయ్.

గడపదిగి మూర్తి వెనకు తిరిగాడు అనంతాకాశం వైపు దృష్టి నిగిడ్చి.

